క్లుప్తంగా

మసీదు పునర్నిర్మాణానికి శంకుస్థాపన



సత్తెనపల్లి: పట్టణంలోని ఎన్జీఓహోం సెంటర్‌లో మసీదు–ఏ–బిలాల్–హుదా పునర్నిర్మాణానికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సిమెంట్, ఇటుకలతో శంకుస్థాపన చేశారు. ముస్లిం మతపెద్దలు ప్రత్యేక దువా చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

నేలవాలిన వరి పంట పరిశీలన

ముప్పాళ్ళ: ఫెంగల్ తుఫాన్ ప్రభావం అంతగా లేకపోయినా ఈదురు గాలులకు వరిపంట నేలవాలినట్లు గుర్తించామని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం, బొల్లవరం, ముప్పాళ్ళ గ్రామాల్లో పొలాలను సోమవారం పరిశీలించారు. మండలంలో 3,748 ఎకరాల్లో వరి పంట సాగు జరిగిందన్నారు. కొద్దిపాటి వర్షం పడుతుండటంతో పడిపోయిన వరి పంటకు ఎటువంటి నష్టం ఉండదన్నారు. అయితే రైతులు ముందు జాగ్రత్తగా 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. పసుపు, మిరప పంటల్లో వేరు కుళ్లుడు వంటివి రాకుండా ఉండాలంటే కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును 3 నుంచి 5 గ్రాములు లీటరు నీటికి కలిపి బాగా తడిచేట్టుగా మొక్కల మొదళ్లలో పోయాలని సూచించారు.

ఆస్థాన సిద్ధాంతిగా బ్రహ్మశ్రీ శ్రీనివాసశర్మ



రాజుపాలెం: పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ పరిధిలోని రాజుపాలెం మండలం పెదనెమలిపురి గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాసశర్మకు అపూర్వమైన గౌరవం దక్కింది. విజయవాడ శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి ఆస్థాన సిద్ధాంతిగా నియమితులయ్యారు. రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖామాత్యులు ఆనం రామనారాయణరెడ్డి చేతులమీదుగా నియామక ఉత్తర్వులను సోమవారం అందుకున్నారు. ఆస్థాన సిబ్బందిగా నియమితులైన బ్రహ్మశ్రీ శ్రీనివాసశర్మను గ్రామంలోని ప్రముఖులు, పలువురు పెద్దలు, ఆయన వద్ద శిక్షణ పొందిన శిష్యులు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మేడికొండూరు ఎస్సై ఖాజీబాబు తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా పెదకూరపాడు మండల గ్రామానికి చెందిన షేక్ షరీఫ్(45) గుంటూరులో నివాసం ఉంటున్నాడు. పెన్షన్ నిమిత్తం మేడికొండూరు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై పెదకూరపాడు వెళుతుండగా మార్గమధ్యలో సిరిపురం బాల యేసు మందిరం సమీపంలో గుంటూరు నుంచి పెదకూరపాడు వెళుతున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తతో షరీఫ్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో షరీఫ్ కిందపడగా లారీ ముందు టైర్లు షరీఫ్ మీదుగా వెళ్లాయి. ప్రమాదం జరిగిన సంఘటనలోని షరీఫ్ మృతి చెందాడు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి



బెల్లంకొండ: విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన బెల్లంకొండలో సోమవారం చోటు చేసుకుంది. గేదె యజమాని గ్రామానికి చెందిన కంభం షేక్ సుభానీ తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగా ఇంట్లో నుంచి నీళ్లు తాగించేందుకు గేదెను వదలగా ఇంటి ముందు ఉన్న ఇనుప స్తంభాన్ని తాకడంతో, విద్యుత్ షాక్ తగిలి గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన గేదె విలువ సుమారుగా రూ.70 వేల వరకూ ఉంటుందన్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సుభాని తెలిపారు.

విత్తన ఎంపికే కీలకం

- రబీ వరిలో విత్తన ఎంపికలో జాగ్రత్తలు అవసరం
- మొలక 80 శాతం ఉన్నవాటినే ఎంచుకోవాలంటున్న అధికారులు
- విత్తనశుద్ధి ప్రధానం



నకరికల్లులో సాగులో ఉన్న వరి నారుమడి

నకరికల్లు: ఓ వైపు వరికోతలు జరుగుతుండగా.. మరో వైపు రెండవ పంటగా ఏం సాగుచేయాలి.. అన్నది ప్రస్తుతం రైతాంగంలో నడుస్తున్న ప్రధాన చర్చ. కాలువల ద్వారా గానీ లేక బోర్లు, బావుల ద్వారా గాని సాగునీటి లభ్యత కలిగి ఉన్న రైతులు రెండవపంటగా రబీలో వరిని సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. రబీ వరిసాగులో విత్తనఎంపిక, కొనుగోలు ప్రక్రియ, విత్తనశుద్ధి, మొలక శాతం ప్రధానం. వీటన్నింటిని బేరీజు వేసుకున్న పుడే పంటలో అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది.

ఎలాంటి విత్తనాలు ఎంపిక చేసుకోవాలి...

సాధారణంగా అక్టోబర్ – జనవరి నెలల మధ్యకాలంలో రబీసీజన్‌గా పరిగణిస్తారు. ఈ సీజన్‌లో సాగుచేయాలనుకున్న వరి విత్తనాల ఎంపికలో రైతులు కీలకంగా వ్యవహరించాలి. అంకూర్ సోనమ్, హెచ్ఎంటీ సోనమ్, కేఎస్ఎం 1638, లాంటి ప్రీమియం క్వాలిటీ విత్తనాలను ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసిన విత్తనాల మొలక శాతం 80శాతానికి పైగా ఉండే విత్తనాలనే ఎంచుకోవాలి. ఎంపిక చేసిన నాణ్యమైన సన్నరకం విత్తనాలతో దిగుబడి అధికం, గింజ సన్నగింజ రకం పంటకు మార్కెట్‌లో అధికరేటు లభిస్తాయి.

కొనుగోలు చేయడమెలా...?

రబీవరిలో విత్తనాలు కొనుగోలు చేయాలనుకున్న రైతులు మొదటగా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఖరీఫ్ సీజన్‌లో తెగుళ్లు ఆశించకుండా, అధిక దిగుబడి వచ్చిన పంటలోని విత్తనాలను ఉత్పత్తి చేసిన రైతుల వద్ద కొనుగోలు చేయడం శ్రేయస్కరం. అలాగే వ్యవసాయశాఖ ద్వారా లైసెన్స్‌లు పొందిన డీలర్ వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. విక్రయ రసీదులపై రైతు, అమ్మకం దారుల సంతకం, పంటరకం, లాట్ నంబర్ ఉండేలా చూసుకోవాలి. విత్తనం కొనేముందు శాంపిల్‌గా మొలకకట్టి మొలకశాతం 80శాతం కన్నా ఎక్కువ ఉన్న విత్తనాలను మాత్రమే ఎంపిక చేసుకోవాలి.

నారుమడి వేసే ముందు విత్తనశుద్ధి ముఖ్యం

నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు చేసిన విత్తనాలు నారుమడిలో చల్లేముందు విత్తన శుద్ధి చేసుకోవాలి. ఒక కేజీ విత్తనానికి 1గ్రాము కర్బండిజం లేదా ట్రైసైక్లోజోల్ 75శాతం డబ్ల్యూపీ పొడిని 0.6 గ్రాముల చొప్పున ఒక లీటరు నీటికి మందు ద్రావణంతో ఒక కేజీ విత్తనాలను శుద్ధి చేసి 24 గంటలు నానబెట్టి మొలక కట్టుకోవాలి. విత్తనశుద్ధి చేయడం వలన చీడపీడలను తట్టుకునే శక్తి మొక్కకు లభిస్తుంది. ఎకరాకు 15 నుంచి 20కేజీలు విత్తనాల చొప్పున లెక్కగట్టి నారుమడి సిద్ధం చేసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి..



విత్తనాల నాణ్యతను పరిశీలించిన తరువాతే కొనుగోలు చేయాలి. రైతులు పండించిన ధాన్యం నుంచి విత్తనాలను సేకరించడం ఉత్తమమైన పద్ధతి. డీలర్‌ల వద్ద కొనుగోలు చేసే సమయంలో ముందుగా మొలకశాతం స్వయంగా పరీక్షించుకోవాలి. దుకాణదారుని వద్ద సంతకంతో కూడిన రసీదును ఖచ్చితంగా తీసుకోవాలి. అలాగే పంటలకు బీమా చేయించుకోవాలి. ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి.

– కె.దేవదాసు, మండల వ్యవసాయాధికారి

బాటిల్‌పై ముద్రించిన ధరకే మద్యం విక్రయించాలి

ప్రొహిబిషన్, ఎక్సైజ్ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, పక్కన ఎస్ఐ నాగలక్ష్మి

సత్తెనపల్లి: ప్రైవేటు మద్యం షాపుల నిర్వాహకులు బాటిల్ పై ముద్రించిన గరిష్ఠ చిల్లర ధరకే మద్యాన్ని విక్రయించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ పి.విజయ్ కుమార్ అన్నారు. ప్రైవేటు మద్యం షాపుల లైసెన్సీలతో పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనధికార మద్యం విక్రయాలు జరపరాదన్నారు. ఎక్కడా మద్యం బెల్ట్ దుకాణాలు నడపరాదని, ఎవరైనా ప్రైవేట్ మద్యం దుకాణదారులు బెల్ట్ షాపులను నడిపితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం షాపులను నడపాలన్నారు. సమావేశంలో ఎక్సైజ్ సత్తెనపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ కె.నాగలక్ష్మి, ప్రైవేట్ మద్యం వ్యాపారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహారం మిగిలితే సమాచారం ఇవ్వండి



75 తాళ్లూరు శాంతికాలనీలో అన్నదానం చేస్తున్న జన చైతన్య సమితి నిర్వాహకులు

పెదకూరపాడు: శుభకార్యాల్లో ఆహారాన్ని వృథా చేయవద్దని, ఆహారం మిగిలితే సమాచారం ఇవ్వాలని జనచైతన్య సమితి ప్రతి నిధులు పేర్కొన్నారు. అమరావతి మండలంలోని మండేపూడి గ్రామంలో గంగా భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో మిగిలిపోయిన భోజనం గురించి ఆలయ కమిటీ పెద్దలు మంగళగిరి లక్ష్మీపతి, జన చైతన్య సమితి(జేసీఎస్) కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావుకు ఫోన్ ద్వారా సమాచార ఇవ్వడంతో వారు అక్కడికి వెళ్లి మిగిలిన ఆహారాన్ని తీసుకున్నారు. మండలంలోని 75 తాళ్లూరు శాంతి కాలనీలో గల బేడబుడగ జంగాల కాలనీలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు మాట్లాడుతూ మిగిలిన ఆహారాన్ని వృథా చేయకుండా పేదవారి కడుపు నింపడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఒంటిపులి అంకమ్మరావు, జన చైతన్య సమితి కో–ఆర్డినేటర్ వెలీతోటి అనిల్ కుమార్, వలంటీర్లు దాసరి కారుణ్య బాబు, రాగిడి ప్రేమ్ కుమార్, గంధం వీర్లంక, సాంబయ్య తదితరులు ఉన్నారు. ఆహారం మిగిలితే 9885557987, 8886777767, 9492271417, 9848977677 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సాంబశివరావు కోరారు.

ఆధ్యాత్మికతతో సేవలు అందించాలి

అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మాడా మల్లికార్జునరావు



హర్‌నాథ్, శ్రీనివాసరావులను సత్కరిస్తున్న నాయకులు

సత్తెనపల్లి: ఆధ్యాత్మికతతో సేవలు అందించి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని ఆర్యవైశ్య నాయకుడు, అభ్యుదయ విజ్ఞాన సమితి అధ్యక్షుడు మాడా మల్లికార్జునరావు అన్నారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కమిటీ సభ్యులుగా నూతనంగా నియమితులైన ఆత్మకూరు హర్‌నాథ్, చిలకల శ్రీనివాసరావులకు అభినందనలు తెలుపుతూ అభ్యుదయ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో సోమవారం ఇరువురిని సత్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎన్నో ఉన్నతమైన పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఆర్యవైశ్య నాయకులు భవిరిశెట్టి శ్రీనివాసరావు, మద్ది భాస్కర్, తొమ్మంద్రు సురేష్, పెరుమాళ్ల పూర్ణచంద్రావు, కొత్త రమేష్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ సలాం, షేక్ జాకీర్, తదితరులు ఉన్నారు.

సేవారత్న శ్రీనివాసరావుకు సత్కారం



శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

సత్తెనపల్లి: వృత్తిరీత్యా న్యాయవాది అయినప్పటికీ నిరంతరం సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సేవారత్న దివ్వెల శ్రీనివాసరావు సేవలు భేష్ అని ఆర్యవైశ్య సంఘ జిల్లా పూర్వాధ్యక్షుడు పెరుమాళ్ళ లక్ష్మీ శివన్నారాయణ అన్నారు. భరతమాత అన్న ప్రసాద వితరణ పథకం 664 రోజులకు చేరుకున్న సందర్భంగా సోమవారం పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో ఆయనను సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు, నాయకులు కాపుగంటి రత్తయ్య, చిలకల శ్రీనివాసరావు, యువ న్యాయవాది దేవిశెట్టి శరత్, నున్న కృష్ణమోహన్, షేక్ ఖలి, తదితరులు ఉన్నారు.

వరిలో పంటకోత ప్రయోగం



పంట కోత ప్రయోగాన్ని నిర్వహిస్తున్న ఏఓ కృష్ణయ్య

బెల్లంకొండ: మండలంలోని కందిపాడు గ్రామంలో సోమవారం వరి పైరులో పంటకోత ప్రయోగాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి డి.కృష్ణయ్య తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా రైతు సైదావలికి చెందిన పొలంలో పైరును పరిశీలించినట్లు తెలిపారు. 5–5 మీటర్ల విస్తీర్ణంలో పంట కోతను నిర్వహించి ధాన్యం నూర్పిడి చేయగా 20.52 కేజీల బరువు గల తడి ధాన్యం దిగుబడి వచ్చినట్లు తెలిపారు. ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి అశోక్ కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ వరప్రసాదరావు, రైతులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథక నిర్మాణం ప్రారంభించండి

ప్రభుత్వాన్ని కోరిన ఏపీ రైతు సంఘ నాయకులు



మాట్లాడుతున్న రైతుసంఘ నాయకులు

నరసరావుపేట: జిల్లాలో నకరికల్లు వద్ద నిర్మించాల్సిన ఎత్తిపోతల పథక నిర్మాణం చేపట్టి నాగార్జునసాగర్ కుడికాలువ ప్రవహించే మూడు జిల్లాలైన పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలోని పదిలక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగు నీరు అందజేయాలని ఏపీ రైతుసంఘ పల్నాడు జిల్లా సమితి నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు కోవెలపూడి రాము మాట్లాడుతూ కృష్ణా, గోదావరి, పెన్నా నదులను అనుసంధానం చేసి హరిశ్చంద్రాపురం నుంచి 80 కిలోమీటర్ల మేర కాలువ, పైపులైను వేసి నకరికల్లు వద్ద ఎత్తిపోతలను ఏర్పాటు చేసి సాగర్ కుడికాలువలో నీటిని ఎత్తిపోసే పథకాన్ని 2017లో శంకుస్థాపన చేశారన్నారు. దీనికి కావల్సిన బడ్జెట్‌ను కూడా కొంత కేటాయించారన్నారు. ఇది అమలైతే మూడు జిల్లాల ప్రజలకు సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని అన్నారు. కృష్ణా డెల్టాకు ఏమాదిరిగా నీటి లభ్యత ఉంటుందో అదేవిధంగా కుడి కాలువ పరిధిలోని రైతాంగానికి నీటి వసతి ఏర్పడుతుందన్నారు. దీని వలన కరువు అనేది ఉండదన్నారు. అందువలన ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టి పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ములుగు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి



పోస్టర్లను ప్రదర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: తెలంగాణా రాష్ట్రం ములుగు జిల్లాలో జరిగిన పోలీసు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమ వారం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో పోస్టర్లను ప్రదర్శించి మీడియాతో మాట్లాడారు. ఒకటవ తేదీ ఉదయం తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లాలో ఏడుగురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్లు తెలంగాణ పోలీసులు ప్రకటించారని అన్నారు. దీనిపై ఆ రాష్ట్ర పౌర హక్కుల సంఘం, ప్రజా సంఘాలు అనేక అనుమానాలు వ్యక్తం చేసి ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం నిర్వహించాలని తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారన్నారు. దీనిపై అనేక అనుమానాలు ఉన్న నేపథ్యంలో విచారణ జరిపించి ఫోరెన్సిక్ నిపుణులతో పోస్టుమార్టం చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. వరుసగా జరిగే ఎన్కౌంటర్లను ఆపేయాలని, మావోయిస్టులతో చర్చలు నిర్వహించాలని, ఎన్నికల సందర్భంగా ప్రజలకి ప్రజాస్వామిక హక్కు లు, స్వేచ్ఛను కల్పిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరావు, నల్లపాటి రామారావు, ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



క్రోసూరు: క్రోసూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎఫ్ఏసీ)గా పంచాయతీ విస్తరణాధికారి జి.శ్రీనివాసరావు బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా పని చేసిన బిక్కి మహేష్‌బాబు ఉద్యోగ విరమణ చేయడంతో ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. శ్రీనివాసరావు గతంలో క్రోసూరు పంచాయతీ సెక్రటరీగా పనిచేశారు. అదేవిధంగా ఇటీవల ఈవోపీఆర్డీగా క్రోసూరుకు వచ్చారు. అనంతరం ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకోవటం జరిగింది. నూతన ఎంపీడీఓకు కార్యాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కస్టమర్ ఎగ్జిక్యూటివ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

క్రోసూరు: క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకుల నుంచి కస్టమర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్ కోర్సులో శిక్షణ కోసం మంగళవారం నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీ సోమవారం తెలిపారు. రెండు నెలల పాటు నిర్వహించే శిక్షణ కోర్సు అనంతరం ఉపాధికల్పించబడుతుందని చెప్పారు. పదవతరగతి ఆపైన చదువుకుని 15 నుంచి 45 వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు ఆధార్, చదువుకున్న అర్హత మార్కుల సర్టిఫికెట్ల జిరాక్స్‌కాపీలు, ఫొటోలు రెండు జతచేయాలన్నారు. దరఖాస్తు చేయదలచుకున్న అభ్యర్థులు బాపతు అంజిరెడ్డిని 9494986164 నెంబరులో సంప్రదించాలని కోరారు. ఈనెల 5వ తేదీవరకు దరఖాస్తులు అందజేయవచ్చన్నారు.

నేడు దివ్యాంగులకు ఆటల పోటీలు

సత్తెనపల్లి: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో విద్యనభ్యశిస్తున్న ప్రత్యేక అవసరాల విద్యార్థులకు మంగళవారం పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లో గల భవిత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించటం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అందరూ తమ పాఠశాలలోని ప్రత్యేక అవసరాల విద్యార్థులను పోటీలకు పంపాలన్నారు.

పేకాట స్థావరంపై దాడి

వినుకొండ: నూజెండ్ల మండలంలో రవ్వారం సమీపంలో కొండ వెనుక ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడిచేసినట్లు ఐనవోలు పోలీసులు తెలిపారు. ఎనిమిది మంది పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,03,500 నగదు, ఎనిమిది ద్విచక్రవాహనాలు, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

క్రీస్తు జననం లోకానికి వెలుగు

ఏపీఎస్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బిషప్ డా.ప్రతాప్ సింహాకొమానపల్లి



చిలకలూరిపేటటౌన్: క్రీస్తు జననం లోకానికి వెలుగు అని ఏపీఎస్‌పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు బిషప్ డా.ప్రతాప్ సింహా కొమానపల్లి సందేశం అందించారు. పట్టణంలోని యేసు క్రీస్తు దివ్యశాంతి నిలయంలో సోమవారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏపీపాస్టర్స్ ఫెలో షిప్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పాస్టర్ నందమూరి క్రిష్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లాల్లోని పాస్టర్లు హాజరయ్యారు. రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ డా. డేనియల్‌పాల్, గుంటూరు జోనల్ చైర్మన్ డా ఎంఎస్ విక్రాంత్‌వర్ధన్, పల్నాడు జిల్లా సలహాదారులు సుధీర్‌కుమార్, జనరల్ సెక్రెటరీ బిషప్ డా. జె.జయరావు పాల్గొని దేవుని వ్యాఖ్య పరిచర్యల చేశారు.

పోలీసులు క్రీడల్లోనూ రాణించాలి

సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు



కబడ్డీలో ప్రతిభ చూపిన సత్తెనపల్లి పోలీస్ టీమ్‌ను అభినందిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

సత్తెనపల్లి: పోలీసులకు విధి నిర్వహణతో పాటు క్రీడలు చాలా అవసరమని సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు అన్నారు. నరసరావుపేటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో రెండు రోజులుగా నిర్వహించిన పోలీస్ వార్షిక గేమ్స్ స్పోర్ట్స్ మీట్‌లో కబడ్డీ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన సత్తెనపల్లి పోలీస్ టీం క్రీడాకారులను సోమవారం పట్టణంలో ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ హనుమంతరావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఎక్కువమంది క్రీడలకు ప్రాముఖ్యత ఇవ్వడం లేదన్నారు. క్రీడలతోనే మానసిక ఉల్లాసం, ఆరోగ్యం సిద్ధిస్తాయన్నారు. ఈ సందర్భంగా కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించిన సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమీరుద్దీన్, హెడ్ కానిస్టేబుళ్లు రామారావు, బాషా, కానిస్టేబుళ్లు పి.రవీంద్రనాథ్, గౌతమ్ బుద్ధరావు, ఉదయ్, నాగారాజు, శివరామకృష్ణ, రమేష్, రవిచంద్రనాయక్, రామకృష్ణ తదితరులను ప్రత్యేకించి అభినందించారు. పట్టణ సీఐ బ్రహ్మయ్య, సత్తెనపల్లి రూరల్ సీఐ సుబ్బారావు, సత్తెనపల్లి రూరల్ ఎస్‌హెచ్ఓ శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐలు ఎం.సంధ్యారాణి, పవన్‌కుమార్, పోలీస్ కానిస్టేబుళ్లు, తదితరులు ఉన్నారు.

తమిళనాడులో తప్పిపోయి...

- మతిస్థిమితం లేక నరసరావుపేట చేరిన వ్యక్తి
- క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు



తవమణిని తండ్రికి అప్పగిస్తున్న రూరల్ ఎస్ఐ కిశోర్

నరసరావుపేట రూరల్: మతిస్థిమితం లేని తమిళనాడుకు చెందిన యువకుడిని రూరల్ పోలీసులు తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. కేసానుపల్లి పరిధిలోని లలితాదేవి కాలనీలో ఆదివారం సాయంత్రం విజుబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న రూరల్ పోలీసులకు గుర్తుతెలియని యువకుడు తారసపడ్డాడు. పోలీసులు యువకుడిని విచారించగా వివరాలు కూడా సక్రమంగా వెల్లడించలేదు. యువకుడు మాట్లాడుతున్న భాష ఆధారంగా తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతని ద్వారా కుటుంబసభ్యుల ఫోన్ నెంబర్ తెలుసుకున్న పోలీసులు వారికి సమా చారం అందించారు. సోమవారం యువకుడి తండ్రి లోకనాథం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఎస్ఐ కిశోర్ వారిని విచారించి వివరాలు సేకరించారు. యువకుడు పేరు తవమని అని, 20 రోజుల క్రితం తిరువల్లూరు హాస్పిటల్‌కు వైద్యం కోసం తీసుకెళ్లగా అక్కడి నుంచి కనిపించకుండా పోయాడని లోకనాథం పోలీసులకు తెలిపాడు. యువకుడి ఆచూకీ కోసం పలు ప్రాంతాల్లో గాలించినట్టు వివరించారు. తమ కుమారుడిని తమకు అప్పగించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశాడు. పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

పోయి రావమ్మా...!

కృష్ణానదిలో పోలి స్వర్గ పుణ్యస్నానాలు



మాదిపాడు నందులరేవులో వేకువజామున పోలిస్వర్గ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోగల ఉత్తరవాహినిగా ప్రవహించే పవిత్ర కృష్ణానది నందులరేవులో సోమవారం భక్తులు కార్తికమాస ముగింపు పోలిస్వర్గ పుణ్య స్నానాలు ఆచరించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్తరవాహినిలో బ్రహ్మముహూర్తంలో స్నానాలు చేసి కార్తిక దీపాలు వదిలారు. నది ఒడ్డునే ఉన్న పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోలి స్వర్గ పురాణగాథను శ్రీవేదాంతం పవన్‌కుమార్ ఆచార్యులు భక్తులకు వివరించారు. ఆర్యవైశ్య ప్రముఖుడు దేవరశెట్టి శ్రీనివాసరావు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

– అచ్చంపేట